తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మేనకూరులో... గ్యాస్ పైప్‌లైన్ లీక్‌తో భారీ పేలుడు

- 35 అడుగుల వరకు పైకి లేచిన రాళ్లు, మట్టి
- ఎవరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం



పేలుడు సంభవించడంతో ఆ ప్రాంతంలో ఏర్పడిన పెద్ద గోతి

నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ సమీపంలో భారీ ప్రమాదం జరిగింది. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటికి గ్యాస్ సరఫరా కార్యక్రమంలో భాగంగా ఓ ప్రైవేటు గ్యాస్ ఏజన్సీ చేపట్టిన గ్యాస్ పైపులైన్‌లో పేలుడు సంభవించింది. పైపులైన్ నిర్మిస్తున్న క్రమంలో పేలుడు సంభవించింది. ఈ క్రమంలో పెద్ద శబ్దంతో సుమారు 35 అడుగుల మేరకు మట్టి, రాళ్లు ఎగిసిపడి ఐదు అడుగుల దాకా గోతి ఏర్పడింది. రాత్రి సమయం కావడం, సమీపంలో నివాసాలు, జన సంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లు స్థానికులు చెప్పున్నారు. ఇదిలావుంటే ఈ సంఘటనతో సమీపంలో ఉన్న డాబాలో ఉన్న కొందరు భయంతో పరుగులు తీశారు. దుకాణాలు మూసి ఉండటంతో పెను ప్రమాదం తప్పి నట్లయింది. గత కొంతకాలంగా జాతీయ రహదారి సమీపంలో ఒజిలి వద్ద, మేకూరు పారిశ్రామికవాడ సమీపంలో పైపులైన్ నిర్మిస్తున్న సంస్థ ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోలేదని పలువురు విమర్శలు చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా... కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



చంద్రగిరి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమైనట్లు టిటిడి జెఈఓ వీరబ్రహ్మం తెలిపారు. శ్రీనివాస మంగా పురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ఉదయం జెఈఓ ధ్వజా రోహణం కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్స వాలను పురస్కరి ంచుకుని టిటిడి ఉద్యానవన, విద్యుత్ డిపార్ట్‌మెంట్స్ సిబ్బంది ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంక రణలతో ముస్తాబు చేసినట్లు తెలిపారు. ఈ నెల 15న గరుడ వాహనసేవ, 16న స్వర్ణ రథోత్సవం, 18న రథోత్సవం, 19న చక్రస్నానం పర్వదినాలలో భక్తుల రాకకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కంకణభట్టార్ బాలాజీ రంగాచార్యులు మాట్లాడుతూ కళ్యాణ వెంకన్న ఆలయంలో ఉదయం 8.40 నుండి 9 గంటల మధ్యన మీన లగ్నంలో ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఉదయం స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుచ్చి వాహనం విహరిస్తూ ఆలయ ఆవరణలోని ధ్వజస్థంభం వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు విస్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ట, రక్షా బంధనం చేపట్టారు. వైఖానస ఆగమోక్తంగా గరుత్మంతుడిని నూతన వస్త్రంపై లిఁచించి ప్రత్యేక పూజలతో ధ్వజస్థంభంపై ప్రతిష్టించారు. అనేక పుణ్యదానాల ఫలితాలు ఒక్క గరుడారోహణంతో లభించే పుణ్యఫలాలకు సాటిరాదని పురాణాలు వెళ్ళడిస్తు న్నాయి. అదేవిధంగా సమాజ శ్రేయస్సు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహపడుతుందని విషయాలను తెలియజేస్తున్నాయి. 18 గణాల ముక్కోటి దేవతలను బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే ధ్వజారోహణ ఘట్టం ముఖ్య లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురు మూర్తి , ఆగమ సలహా దారులు మోహన రంగాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి, సూపరింటెండెంట్స్ మునిచెంగల్రాయులు, శ్రీనివాస రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**-పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు**

శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో మొదట రోజు శనివారం రాత్రి దేవదేవుడు పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాంతర్యామి అయిన శ్రీనివాసుడు పెద్దశేష వాహనంపై విహరిస్తూ లోకరక్షకుడుగా ప్రజల ఈతిభాధలను తొలగించి మోక్షమార్గం ప్రసాధిస్తూ తిరుమాడవీధలలో ఊరేగారు. ఈ వాహన సేవలో గజ, అశ్వదళ, నంధీ సమేత కోలాటాల కోలాహలం నడుమ భక్తులు గోవిందనామస్మరణలతో శ్రీనివాసుడిని దర్శించుకున్నారు.

## గాడిలో పడ్డ... యువగళం పాదయాత్ర

**- నేరుగా పంట పొలాల్లోకి వెళ్ళిపోతున్న నారా లోకేష్**



చిత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: జాతీయ తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రస్తుతం జిడి నెల్లూరు నియోజకవర్గంలో నిర్వహి స్తున్న ప్రజాగళం పాదయాత్ర గాడిలో పడింది. ఎస్ఆర్ పురం మండల పరిధిలో శనివారం నారా లోకేష్ పాల్గొన్న యువగళం పాదయాత్రకు పార్టీ నాయ కులు, ప్రజలు, కార్యకర్తలు పోటేత్తారు. యువగళం పాదయాత్రకు జనం పోటేత్తడంతో నారా లోకేష్‌లో హుషారు కన్పించింది. నారా లోకేష్ రెండు రోజులుగా యువగళం పాదయాత్రలో తన స్టైల్ మార్చారు. ఇదివరకు రహదారిపై వెళ్తూ ప్రజలతో మాట్లాడి స్థానికంగా ఏర్పాటు చేసిన సమా వేశాల్లో ఆయన పాల్గొనే వారు. గత రెండు రోజులుగా నారా లోకేష్ రోడ్ల ప్రక్కన వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకొంటున్న రైతుల వద్దకు నేరుగా వెళ్ళి వారితో మాట్లాడుతున్నారు. వారితో కొంత సమయం కూర్చొని వారి సమస్యలను అడిగి తెలుసుకొంటున్నారు. ఎస్ఆర్ పురం మండలం హనుమాన్ టెంపుల్ విడిది కేంద్రం నుండి శనివారం ఉదయం బయలుదేరిన నారా లోకేష్ ఎస్ఆర్ పురం, పుల్లూరుల్లో ప్రజలు, యాదవ సామాజిక వర్గ నేతలు, యువకులతో ముఖా ముఖి కార్యక్రమం నిర్వహిం చారు. అనంతరం పిళ్ళారికుప్పంలో నారా లోకేష్‌కు మహిళలు మంగళ హారతులు పట్టారు. వెంకటాపురంలో కొంతమంది నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

## లోకేశ్ పర్యటనకు ముందు... నేతల ఐక్యతారాగం!

**-పాదయాత్ర విజయంతంపై మల్లగుల్లాలు**



తిరుపతి,ఫిబ్రవరి 11ప్రభాతవార్త: తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేతల్లో అంతర్గత విభేదాలు కలచివేస్తున్నా... యువనేత,పార్టీ జాతీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేశ్ యువగళం పాదయాత్ర తిరుపతి జిల్లాలో ప్రవేశించడానికి ముందే ఐక్యతారాగం ఆలపించారా ?అనే సందేహాలు వ్యక్తమ వుతు న్నాయి. ఓ వైపు యువనేత పాదయాత్రను విజయవంతం చేయడంలో కొందరు నేతలు తలలుపట్టుకుంటున్నా, సందట్లో సడేమియా అన్నట్లు ఇప్పుడే అదనపుగా తమ ప్రాబల్యం చాటుకునేందుకు మరికొందరు నేతలు సై అంటూ సిద్ధమవుతున్నారు. తిరుపతి టిక్కెట్ కోసం ఇప్పటికే పలురకాలుగా పార్టీలు మారిన నేతలు, బలిజ సామాజిక వర్గానికి చెందిన ఆర్థికంగా బలమైన నాయకులు సై అంటున్నా... కష్టకాలంలో పార్టీని నమ్ముకుని నిలబడి అధికార వైసిపిపై పోరాటం చేసిన వారిని కాదని కొత్తవారికి టిక్కెట్లు ఇచ్చేదిలేదని అధినేత స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి తిరుపతి జిల్లాలో మొదలుకానున్న లోకేశ్ పాదయాత్రను విజయవంతం చేయడంలో ఎవరికివారే అన్నట్లు జనబలం నిరూపించుకునేందుకు ఉత్సాహపడుతు న్నారు. ఇప్పటికే రానున్న ఎన్నికలకు సంబంధించి తిరుపతి టిక్కెట్‌పై సుగుణమ్మ వైపే అధినేత సుము ఖత చూపి, ఆమె అభ్యర్థిత్వాన్ని నిర్ణయించినా కొందరు నేతల్లో మాత్రం అయోమయం వీడలేదు. దీనికి తగ్గట్లు తిరుపతిలో టిడిపికి అనుభవజ్ఞులైన సీనియర్ నేతలు, పార్టీ పదవుల్లో ఉన్న కేడర్ నాయకులు పదుల సంఖ్యలోనే ఉన్నారు. ఈ కేడర్ పూర్తిగా కలసి కట్టుగా పనిచేసి, ఎక్కడికక్కడ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే తప్ప టిడిపి బలం పుంజుకోదనేది కార్యకర్తల్లో వినిపిస్తున్న బలమైన వ్యాఖ్యలు. ఇదే సమయంలో లోకేష్ పాదయాత్రలో తిరుపతి నేతలుఅనుసరించే వ్యూహంపైనే తిరుపతి అభ్యర్థి ఖరారయ్యే అవకాశం ఉందనేది పార్టీ నేతల్లో గుసగుసలు. ఇదిలా ఉండగా నారాలోకేష్ పాదయాత్రకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలు ఎంత వరకు అడ్డు తగులు తుందనేది పక్కన పెడితే చిత్తూరు జిల్లాలో ఎదురైన చేదు ఘటనలు, ఇబ్బందికర పరిస్థితులు పునరావృతం కాకుండా తిరుపతి జిల్లాలో అటు పోలీసు అధికారుల సహకారం కూడా సానుకూలంగానే తీసుకునే దిశగా టిడిపి నేతలు వ్యవహరిస్తున్నారు. లోకేష్ పర్యటనకు సంబంధించి షెడ్యూల్‌ను, పాదయాత్ర సాగే రూట్‌ను టిడిపి నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, సూరా సుధాకర్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, వట్టికుంట శంకరనారాయణ, మహేష్‌యాదవ్, ఊకా విజయకుమార్ శనివారం తిరుపతి అదనపు ఎస్పీ పి.వెంకట్రావును కలసి వివరించారు. భద్రతకు సంబంధించిన విషయాలపై వినతిపత్రం అందజేశారు. ఇదే ఊపుతో నేతలు ఐక్యంగా పనిచేసి లోకేష్ పర్యటన విజయవంతంచేయాలనేది కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

## వ్యాధుల పట్ల అవగాహనతో... జీవనవిధానంలో మార్పులు

**-ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా జీవించాలి**
**-అవగాహన కార్యక్రమంలో టిటిడి ఇఒ ధర్మారెడ్డి, జెఇఒ సదాభార్గవి**



తిరుమల, ఫిబ్రవరి 11ప్రభాతవార్తప్రతినిధి: నేటి సమాజంలో ప్రజలు అనేక వ్యాధులతో బాధపడు తున్నారని, వీటిపట్ల అవగాహన కల్పించుకుని జీవన విధానంలో మార్పులు చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ,జెఇఒ సదాభార్గవి పిలుపునిచ్చారు. వివిధ వ్యాధులకు వైద్యం అందించే ప్రముఖ వైద్యనిపుణులతో అవగాహన కార్యక్రమం నిర్వహించడం వల్ల ఈ కార్యక్రమం ఉద్యోగులకు ఎంతో ఉపయోగం లభిస్తుందని అభిప్రాయ పడ్డారు. టిటిడి ఉద్యోగులకు జీవనశైలి రుగ్మతలపై మూడురోజుల అవగాహన కార్యక్రమం శనివారం తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రారంభమైంది. ముఖ్యఅతిధిగా ఇఒ ధర్మారెడ్డి ,జెఇఒ సదాభార్గవి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, పద్మావతి చిన్నపిల్లల వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి,శ్వేత సంచాలకురాలు ప్రశాంతి, పాల్గొని ఉద్యోగుల ఆరోగ్యం,పాటించాల్సి న నియమాలు, పౌష్టికాహారం తదితర అంశాలపై వివరించారు. 15 సంవత్సరాల వయస్సు దాటినప్పటి నుండి వ్యాధుల పట్ల అవగాహన కల్పించుకోవాల్సి న అవసరం ఉందన్నారు. గురక వల్ల గుండె, మెదడుకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయన్నారు. వీటిపై అవగాహన కల్పించుకుని ఆచరిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జీవనశైలి రుగ్మతలపై ముద్రించిన పాకెట్ పుస్తకాన్ని ,అత్యధిక షుగర్‌లెవల్స్‌తో బాధపడుతున్న ఉద్యోగులకు కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి టిటిడి ఉద్యోగ సంఘాల నాయకులు చీర్లకిరణ్,రవికుమార్, గోల్కొండ వెంకటేశులు, హేమలత, వి.రామచంద్రయాదవ్, ఆంజనేయులు, నాగార్జున తదితరులు పూర్తి సహాయ సహకారాలందించారు.

## సమస్యలకు ఆలోచిస్తే పరిష్కారం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు**

చిత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: గుండె గుప్పెడంతే అయినాకొండంత ప్రేమను పంచగలమని, క్షణికావేశంలో చేసిన తప్పిదాలు, సమస్యలను ప్రేమాభిమానాలతో ఆలోచిస్తే సులభంగా పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అన్నారు. చిత్తూరు జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్, 6వ అదనపు జిల్లా జడ్జి ఎస్.శాంతి, 8వ అదనపు జడ్జి శ్రీదేవి, 3వ అదనపు సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్, ఎక్సైజ్ మేజిస్ట్రేట్ కె.రవి, అడ్మిన్ ఎఎస్పీ జగదీష్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.రాజేంద్రరెడ్డి, డిఎస్పీ శ్రీనివాసమూర్తి, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ సుప్రీం, హైకోర్టుల ఆదేశాల మేరకు జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోటర్ వాహనాల కేసులు, రెవెన్యూ, వివాహ సంబంధ కేసులు, ప్రీలిటిగేషన్ తదితరాల కింద 12,398 కేసులను గుర్తించడం జరిగిందన్నారు. కుటుంబ వ్యవస్థలో బంధాలు బలపడాలంటే ప్రేమలో ధనవంతుడిగా, కోపంలో పేదవాడిగా వుండాలన్నారు. ప్రేమాభిమానాలతో ఆలోచిస్తే కుటుంబాల్లో క్షణికావేశాల్లో తీసుకొన్న తప్పుడు నిర్ణయాలు పరిష్కారం అవుతాయన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇరు కక్షిదారులకు ఆమోదయోగ్యమైన తీర్పు లభిస్తుందన్నారు.

ఇంట్లో తల్లి బాగుంటేనే ఇల్లు బాగుంటుందని, సమాజం బాగుంటేనే దేశం బాగుంటుందని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ చెప్పారని గుర్తు చేశారు. దేశం బాగుండాలంటే ముందుగా కుటుంబ వ్యవస్థ బాగుండాలని ఆయన అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. కక్షిదారులకు సయమం సైతం వృధా కాదన్నారు. జిల్లా కోర్టుతో పాటు జిల్లాలోని 13 మండల న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఇన్సురెన్స్ కంపెనీలు ముందుకు వచ్చి కేసుల పరిష్కారంకు సహకరించాలని కోరారు. అడ్మిన్ ఎఎస్పీ జగదీష్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించే కేసులు మళ్ళీ అప్పీల్‌కు వెళ్ళడానికి వీలు వుండదన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో నాటుసారా, మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన కోసం స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. నాటుసారా, గంజాయి, డ్రగ్స్ ఎక్కడైనా చలామణి అవుతుంటే 14500 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా కోర్టులో శనివారం నాలుగు బెంచ్‌లను ఏర్పాటు చేశారు.

## అగ్రిధాన్ 2023 బ్యాచ్ ప్రారంభం



శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : ఏర్పేడు మండల కేంద్రంలోని ఐఐటిలో 2023 అగ్రిధాన్ బ్యాచ్‌ను డైరెక్టర్ ప్రొఫెసర్ కెయన్ సత్యనారాయణ ప్రారంభించారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ కార్యక్రమాలను ఆయన శ్రీకారం చుట్టారు.నవ విష్కార్ ఐ హబ్ ఫౌండేషన్ సారథ్యంలో ఒరెండు రోజుల పాటు నిర్వహించే ది గేయిన్ మరియు అబ్‌సెల్యూట్ సహకారంతో ప్రారంభించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ భారత దేశంలో ప్రస్తుత వ్యవసాయ స్థితి గతుల గురించి వ్యవసాయ సమాచారం మెరుగు పరచటానికి రైతులకు సహాయం చేయటానికి ప్రధాన ప్రాంతాలను ప్రస్తావించారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యత గురించి తెలిపారు. అగ్రిధాన్ 2023 విద్యార్థులు మరియు పరిశోధకులకు విన్నూత్నమైన పద్దతుల్ని అభివృద్ది చేయటానికి వేదికను అందించటం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. పొజిషినింగ్ మరియు ప్రెసిషన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవ సాయంలో సవాళ్ళు, సమస్యలను తగ్గించటానికి ఆచరణాత్మక, ఆర్థిక పర్యవరణ, అనుకూల ఆలోచనలు పద్దతులపై పని చేయటానికి విద్యార్థులకు వివరించారు.వివిధ సంస్థలకు చెందిన 116 మంది విద్యార్థులు తమ ఆలోచనను ప్రదర్శించుటకు వచ్చారని వివరించారు.ఈ విద్యార్థి బృందాలకు ఐఐటి,ఐసర్ ఫ్యాకల్టీ సభ్యులు రెండు రోజుల పాటు మార్గదర్శకాలు సూచిస్తారు. విజేతలకు బహుమతులు అందజేస్తారని వివరించారు.ఈ కార్యక్రమాల్లో డైరెక్టర్ ద గేయిన్ సిఇఓ వరదరాజన్ కృష్ణన్, ఐఐటి టెక్నాలజి డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాస్తవ, హబ్ సిఇఓ శ్రీనివాస మూర్తి బిడియం,ఎన్ బి హర్షవర్ధన్‌రెడ్డి గేయిన్ టీం, ఐఐటి నిప్ బృందం, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 3 గంటలు టెన్షన్...!

- ఇంటి నుండి పారిపోయి బెంగళూరు చేరిన ఏఆర్ కానిస్టేబుల్ కుమార్తె
- ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన పోలీసులు - కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి సిసి కెమెరాల పరిశీలన
- బెంగళూరు బస్సు ఎక్కి వెళ్ళినట్లు గుర్తింపు- బెంగళూరు నుండి సురక్షితంగా అమ్మాయిని తల్లిదండ్రులకు అప్పగింత



దియాకు కౌన్సెలింగ్ ఇస్తున్న అడ్మిన్ ఎఎస్పీ జగదీష్

చిత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: చిత్తూరులోని ఓ ఏఆర్ కానిస్టేబుల్ కుమార్తె అటు కుటుంబసభ్యులు, ఇటు పోలీసులను 3 గంటల పాటు టెన్షన్‌కు గురిచేసింది. శుక్రవారం స్కూల్ నుండి తిరిగి వచ్చిన ఏఆర్ కానిస్టేబుల్ కుమార్తె తాను బెంగళూరులోని పిన్ని వాళ్ళింటికి వెళ్తున్నట్లు లేఖ రాసి కన్పించ కుండా పోయింది. లేఖ చూసిన ఏఆర్ కానిస్టేబుల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ చిన్నారి కోసం పోలీసులు వెతుకులాట ప్రారంభించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సిసి కెమెరాలను పరిశీలించిన పోలీసులు ఏఆర్ కానిస్టేబుల్ కుమార్తె ఎంఎస్ఆర్ సర్కిల్ బస్‌స్టాప్ వద్దకు వెళ్తున్నట్లు స్పష్టం కావడంతో ఆమె బెంగళూరు బస్సు ఎక్కిందని నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. చిత్తూరు ఆర్‌టిఓ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఈశ్వర్‌రెడ్డి విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి దియా(14) సంవత్సరాల కుమార్తె వుంది. శుక్రవారం సాయంత్రం స్కూల్ నుండి ఇంటికి తిరిగి వచ్చిన దియా 4.15 గంటలకు తాను బెంగళూరులోని పిన్ని వాళ్ళింటికి వెళ్తున్నట్లు ఒక లేఖ రాసి ఇంటి నుండి వెళ్ళిపోయింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఏఆర్ కానిస్టేబుల్ ఈశ్వర్‌రెడ్డి ఆర్ఐ ఎంటిఓ మధుకు సమాచారం అందించాడు. ఈ విషయంను ఆర్ఐ ఎంటిఓ మధు ఎస్పీ రిశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి ఆయన ఉత్తర్వుల మేరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. అలాగే రైల్వే స్టేషన్, బస్ స్టేషన్లతో పాటు బస్ స్టాపులు, నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు పాప కోసం వెతులాట చేపట్టారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సిసి కెమెరాలను పరిశీలించగా దియా 4.20 గంటల సమయంలో పలమనేరు బస్‌స్టాప్ వైపు వెళ్ళినట్లు రికార్డు అయ్యింది. అనంతరం ఆర్ఐ ఎంటిఓ మధు చిత్తూరు నుండి బెంగళూరుకు ఆ సమయంలో వెళ్ళిన ఆర్టీసీ బస్సుల వివరాలను కనుగొని ఆ బస్సు డ్రైవర్ల ఫోన్ నెంబర్లు సేకరించి వారితో దియా గురించి వివరాలు సేకరించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఒక డ్రైవర్ చిత్తూరు ఎంఎస్ఆర్ బస్‌స్టాప్‌లో సాయంత్రం 4.40 గంటలకు దియా బెంగళూరు బస్సు ఎక్కిందని చెప్పడంతో దియా ఫోటోను బస్ డ్రైవర్‌కు పంపడంతో ఆ డ్రైవర్ బస్సు ఎక్కింది ఆమె అని నిర్ధారించాడు. ఆపై స్పందించిన పోలీసులు దియాను బెంగళూరు కెఆర్ పురం బస్‌స్టేషన్‌లో పోలీసు మిత్రులకు అప్పగించడంతో ఆ మేరకు చిత్తూరు పోలీసులు అక్కడికి వెళ్ళి దియాను సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ రిశాంత్‌రెడ్డి విద్యార్థి దియాతో పాటు ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గంటల వ్యవధిలో తప్పిపోయిన విద్యార్థి దియాను కనుకొని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన ఆర్ఐ ఎంటిఓ మధు, సిబ్బంది సురేంద్ర, కుమార్, పృధ్వీలను ఎస్పీ రిశాంత్‌రెడ్డి, అడ్మిన్ ఎఎస్పీ జగదీష్‌లు అభినందించి క్యాష్ రివార్డులను బహుకరించారు.

## అంబులెన్స్‌కు దారి... ఇవ్వకపోవడంతో వ్యక్తి మృతి

-పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు
-సూపర్ బజారు కూడలి వద్ద ట్రాఫిక్‌లో అంబులెన్స్
- తిరుపతికి తలిస్తుండగా 15 నిమిషాలు నిలిచిపోయిన అబబులెన్స్



పాతరామసేతువంతెన వద్ద ఇరుక్కు 108 అంబులెన్స్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : అసలే ఇరుకురోడ్లు..ఆపై అవగాహన లేని వాహన చోదకులు. ఈరెండింటి నిర్లక్ష్యంతో ఓనిండుప్రాణం బలైంది. ఆకుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారు? అంబులెన్స్‌కు దారి ఇవ్వాలన్న జ్ఞానం వాహనచోదకులకు లేకపోగా, దారి ఇప్పించాలన్న బాధ్యతను పోలీసులు విస్మరించారు. ఓ రాజకీయ నాయకుని బంధువుకు దారి ఇప్పించడానికి పోలీసుల పాటు పడ్డారే తప్ప అంబులెన్స్‌ను ముందుకు పంపాలన్న ఆలోచనా, బాధ్యతను విస్మరించారు. ఫలితంగా ఓనిండు ప్రాణం బలైంది. శనివారం ఉదయం నుంచి పట్టణంలో ఒకటే ట్రాఫిక్..ట్రాఫిక్.. ఓవైపు ఆటోలు, మరోవైపు ద్విచక్రవాహ నాలు, బస్సులు, కార్లు అడ్డదిడ్డంగా నిలచిపో వడంతో పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది. దీన్ని కాస్త పోలీసులు కంట్రోల్ చేసినా తిరిగి మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ట్రాఫిక్ మధ్యలో ఓఅంబులెన్స్ కుయ్.. కయ్.. మంటూ వస్తోంది. అందులో ఓవ్యక్తి హఠాత్తుగా గుండెపోటుకు గురై తిరుపతికి తరలిస్తున్నారు. అయితే స్థానిక సూపర్‌బజారు కూడలి వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉండడం, దీనికి తోడు ఎవ్వరు కూడా అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడంతో దాటుకుని వెళ్లేందుకు సుమారు 15నిమిషాలు పట్టింది. దీంతో అంబులెన్స్ పాత రామసేతువంతెనపైకి రాగానే అందులో ఉన్న వ్యక్తి మృతిచెందాడు. దీన్ని ప్రభాతవార్త పరిశీలించగా తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన గోడాం రాజారెడ్డి(64) మృతిచెంది ఉండడం కనిపించింది. ఈయన గత కొంతకాలంగా పట్టణంలోని బంగారమ్మ కాలనీకి సమీపంలో భార్య, కుమారుడు అశోక్‌తో కలసి ఉంటున్నారు. ప్రతిరోజు లాగే శనివారం కూడా మధ్యాహ్న సమయంలో బంగారమ్మ ఆలయం వద్ద ఉన్న అరుపై కూర్చుని వచ్చివెళ్ళేవారితో పిచ్చాపాటి మాట్లాడుతాడు. ఏం జరిగిందో ఏమో కానీ హఠాత్తుగా ఒక్కసారి కుప్పకూలిపోవడంతో గమనించి స్థానికులు వెంటనే సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. దీంతో భార్య, కుమారుడు అశోక్‌లు హుటాహుటిన ఓప్రైవేటు అంబులెన్స్‌లో తరలిస్తుండగా సూపర్ బజారు కూడలి వద్ద అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. దీంతో ఇక్కడ నుంచి రామసేతువంతెనపై నుంచి వచ్చేసరికి రాజారెడ్డి తుది శ్వాసవిడిచారు. ట్రాఫిక్ సిబ్బంది ఉన్నా వారు ఏమీచేయలేకపోతున్నారు. ఓవైపు భూగర్భవిద్యుత్‌కు తవ్విన గుంతలకు సిమెంటు వేయడంతో పలుమార్గాల్లో ట్రాఫిక్ స్తంభించింది. ఓవైపు భూగర్భ విద్యుత్ పనులతో ట్రాఫిక్‌ను కట్టడిచేయడంతో ఈసమస్య నెలకొంది.

# జడ్పీచైర్మన్‌చే ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



కుప్పం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను శనివారం జడ్పీచైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్‌లు కలసి పరిశీలించారు. ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న రాతి మండపాన్ని పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అంతకు ముందు ఆలయంలో శ్రీ మల్లేశ్వరస్వామివారిని వారు దర్శించుకున్నారు. అనంతరం మహాశివరాత్రి పండగకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీటిసి కృష్ణమూర్తి, సర్పంచ్ అమర్‌నాథ్, ఎంపిటిసి మోహన్, యూత్ అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఉచిత కంటి ఆపరేషన్లకు 30మంది ఎంపిక

కుప్పంరూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :



కుప్పం లయన్స్‌క్లబ్, పిఇఎస్ ఆస్పత్రి అధ్వర్యంలో శనివారం పిఇఎస్ అర్బన్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శిబిరంకు హాజరైన వారికి కంటి పరీక్షలు జరిపి ముప్పై మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శిబిరంకు వచ్చిన వారికి బిఆర్‌డి ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు భోజన వసతి సమకూర్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా॥ అంబా మహేష్, ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్, కోశాధికారి సెంధిల్, అడ్మినిస్ట్రేటర్ పిజి సెల్వం, క్లబ్ డైరెక్టర్లు డా॥ సురేష్‌బాబు, శివ, నితిన్, ప్రసాద్, వైద్య బృందం పాల్గొన్నారు.

## గణనాథునికి బంగారు వీభూది పట్టీ బహూకరణ

కాణిపాకం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారికి ఓ భక్తుడు శనివారం బంగారు వీభూది పట్టీని విరాళంగా ఆందజేశారు. చిత్తూరుకు చెందిన కాశీనాధన్ అనే భక్తుడు సుమారు 2.50 లక్షల రూపాయల వ్యయంతో 44 గ్రాముల బంగారుతో స్వామివారికి ప్రత్యేకంగా తయారు చేయించిన వీభూది పట్టీని విరాళంగా అందజేశారు. ఈవీభూదిపట్టీనిదాత కుటుంబభ్యులతో కలసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డికు అందజేశారు. దాతలకు ఆలయసంప్రదాయంప్రకారంస్వామివారిదర్శనంకల్పించి,తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెంటెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీనదయాల్ సంస్కరణలే మార్గదర్శకం

పుంగనూరు,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :



భారతీయదార్శనికతను ప్రపంచానికి చాటిచెప్పిన పండిత్‌దీనదయాల్ సేవలు ప్రశంసనీయమని నియోజకవర్గ భాజాపా కన్వీనర్ గన్నా మదన్‌మోహన్‌బాబు అన్నారు. జిల్లా నాయకుడు పులిసరేంద్ర మాట్లాడుతూ భాజాపాను బలోపేతం చేసేందుకు కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఏబివిపి రాష్ట్ర నాయకుడు విజయ్‌శంకర్ మాట్లాడుతూ కేంద్రపథకాలనుతమవిగాచెబుతూ రాష్ట్రంలో ప్రజలను ఏమార్చుతున్న వైకాపా ప్రభుత్వం పనిపట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు బాబు,గణేష్,తదితరులు పాల్గొన్నారు.

## 481కేసుల పరిష్కారంతో లోక్‌అదాలత్ రికార్డు

పుంగనూరు,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :

సుదీర్ఘంగా అపరిష్కారంగా ఉన్న 481 కేసులను ఒక్కరోజులో పరిష్కరించి పుంగనూరు సీనియర్ సివిల్‌జడ్జికోర్టు రికార్డు సాధించింది. సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు, జూనియర్ జడ్జిలు కార్తీక్,సింధుల అధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈపరిష్కారాలతో పాటూ రూ.54లక్షల పరిహారాలకు తీర్పునిచ్చింది. బార్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు బాలాజీకుమార్, వెంకటముని యాదవ్, చెన్న కేశవులు, ఆనంద్, సురేష్, వినోద్, వెంకటరమణ, ఎస్ఐ కుళ్ళాయప్ప, కక్షిదారులు పాల్గొన్నారు. వీరి సేవలను స్థానికులు అభినందిస్తున్నారు.

## ఘనంగా మహాకుంభాభిషేకం

గుడిపాల, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:



మండలంలోని రామభద్రాపురం పంచాయ తీ బుచ్చన్న కండ్రిగ గ్రామంలో శనివారం శ్రీ వరసిద్ధి వినాయకస్వా మి, రుక్మిణి సమేత శ్రీ కృష్ణ భజన మందిరాలకు శాస్త్రో క్తంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటి రోజు గణ పతి పూజ, లక్ష్మీపూజ, నవగ్రహ పూజ నిర్వహించి వినాకయకస్వామి విగ్రహం, రుక్మిణి సమేత శ్రీకృష్ణుడి చిత్రపటంను పురవీధుల్లో ఊరేగించారు. సర్పంచ్ గోళ్ళ హరిణి హేమాద్రినాయుడు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

శాంతిపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :



కళ్యాణ ఫౌండేషన్ సొసైటీ అధ్వర్యంలో మండలంలోని కడపల్లి, తిమ్మరాజుపల్లి హైస్కూళ్లలో చదివే విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వితరణగా అందించారు. ఎంఇఒ చంద్రశేఖర్, కళ్యాణ్ ఫౌండేషన్ ఛైర్మన్ డా॥ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.ఉపాధ్యాయుడు చిరంజీవి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ నివాసాల కూల్చివేత

-దేశం ఆందోళన...ఇద్దరు అరెస్టు

**పుంగనూరు,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** పట్టణంలోని నానాసాహెబ్‌పేటలోని జోగిండ్ల వద్ద అక్రమనివాసాలను కూల్చివేయడాన్ని మున్సిపల్ అధికారులు శనివారం ఉదయం ప్రారంభించారు. ఈవిషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు ఉదయం పదిగంటలకు సదరు స్థలంలో ఆందోళనకు పిలుపు నిచ్చారు. సంఘటనా స్థలంలోనికి చేరుకున్న కమీషనర్ నర్సింహప్రసాద్‌ను దేశం నాయకులు సద్దాం,గిరిబాబుతో పాటూ పలువురు ప్రశ్నిస్తూ ప్రత్యామ్నా యస్థలం చూపించి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అయితే,కమీషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంకబ్జాకు గురై పలుమార్లు నోటీసులిచ్చినా వారు ఖాళీ చేయలేదని, పట్టణాభివృద్ధిలో భాగంగా పుంగమ్మచెరువుకట్ల విస్తరణ, ఆధునీకరణ వచ్చినందున తప్పనిసరిగా కూల్చివేతకు సిద్దపడ్డామన్నారు. అయితే దేశంనాయకులు తాము ఆందోళనకు సిద్దపడడంతో సిఐ మధు సూదనరెడ్డి, ఎస్ఐ మోహన్‌కుమార్‌లు ఆందోళానా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సద్దాం,గిరిబాబులను అదుపులోనికి తీసుకున్నారు. ఈవిషయమై కమీషనర్ వివరణ ఇస్తూ ప్రభుత్వస్థలం ఆక్రమణకు గురికావడంతో పాటూ పట్టణాభివృద్ధికి అడ్డుపడుతున్నందునే నివాసాలను తొలగిస్తున్నామన్నారు. దేశం నాయకుల సుహేల్‌బాషా మాట్లాడుతూ నివాసగృహాల వారు రోడ్డున పడ్డారని, వారికి అండగా ఉంటామన్నారు. సిపిఐ నాయకులు వాడగంగరాజు మాట్లాడుతూ ఈవిషయమై మంత్రి పెద్దిరెడ్డి చొరవచూపి,బాధితులను ఆదుకోవాలన్నారు.

## కక్షిదారులకు భోజన ప్యాకెట్స్ వితరణ

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:



జాతీయ లోక్ అదాలత్ ద్వారా తమ కేసులను పరిష్కరించడం కోసం సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కోర్టుకు వచ్చిన కక్షిదారులకు శనివారం మనం ఫౌండేషన్ సభ్యులు భోజన ప్యాకెట్స్ అందజేసారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఐ. కరుణకుమార్ చేతుల మీదుగా సుమారు 250మందికి భోజన ప్యాకెట్స్, మంచినీటిని సరఫరా చేసారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు యుగంధర్, సభ్యులు ఢిల్లీగణేష్, రెడ్డి మస్తాన్, ప్రేమ్, చరణ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్‌ట్రస్ట్ టెక్నాలజీస్‌కు ఎంపికైన విజయం విద్యార్థులు

**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** ప్రముఖ బహుళజాతీ సంస్థ ఆల్‌ట్రస్ట్ టెక్నాలజీస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో విజయం సైన్స్ అండ్ ఆర్ట్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న 89మంది విద్యార్థులు ఎంపికైనట్లు సంస్థ అధినేత డా.ఎం. తేజోమూర్తి తెలిపారు. ఈ ఎంపికలు గ్రూపు డిస్కషన్, హెచ్ఆర్‌రౌండ్ ప్రక్రియల ద్వారా నిర్వహించారనీ, వార్షిక వేతనం రూ. 1.8 నుంచి 2.1లక్షల వరకు అందించనున్నట్లు పేర్కొన్నారు. కాగా ఎంపికైన విద్యార్థులను అధ్యాపక బృందం, తోటి విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు.

## విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు.

-సబ్‌స్టేషన్ ఎదుట గ్రామస్తుల ధర్నా



శాంతిపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :

మండలంలోని రాళ్లబూదుగూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైను మార్చుతుండగా ఓ యువకుడు విదు ్యదాఘాతంకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనికి న్యాయం చేయాలని కుటుంబీకులు, గ్రామస్తులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని గొల్లపల్లికి చెందిన మురుగేష్ (23) తన ద్విచక్రవాహనంలో స్వగ్రామంకు వెళు ్తండగా రాళ్ల బూదుగూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ ఉపేంద్ర తమ కుమారుడ్ని ఆపి విద్యుత్ లైను మార్చాలని ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కించాడని అయితే విద్యుదాఘాతం తగిలి మురుగేష్ ప్రాణాపాయ స్థితికి చేరాడన్నారు. స్థానికులు 108లో కుప్పం ఆస్పత్రికి తరలించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# గడప గడపకూ తిరుగుదాం జగనన్న లక్ష్యాన్ని నెరవేరుద్దాం

చౌడేపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : వైసిపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్ళి తెలుపుదాం తద్వారా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మాట నిలుపుదామని మండల సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజులన్నారు. మండలంలోని చారాల, ఆమినిగుంట, దుర్గసముద్రం, పరికిదొన, గడ్డంవారిపల్లి తదితర సచివాలయాల



పరిధిలోని కన్వీనర్లు, గృహసారధులతో సమావేశమయ్యారు. ఎంపిపి జి.రామ్మూర్తి, సింగిల్‌విండో ఛైర్మన్ రవిచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నరసింహులుయాదవ్, ఎంపిటీసీలు తొండ శ్రీరాములు, ఆయా పంచాయతీల సర్పంచులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎంపీ ఆదాలను కలిసిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే

నాయుడుపేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :



నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ఆదాల ప్రభాకర్ రెడ్డిని ఇటీవల పార్టీ అధిష్టానం నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

## పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి

కోట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :



కోటలోని బిజెపి కార్యాలయంలో శనివారం పండిట్ దీనదయాళ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మండల బిజెపి అధ్యక్షులు డాక్టర్ సారంగం రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్ర సిద్ధాంతకర్తగాపనిచేశారన్నారు.భారతదేశం ఒక స్వతంత్ర్య స్వావలంబన దేశంగా ఉండాలని సూచించారు. పరశురామ్‌సాయి, జిల్లా బిజెపి బిజెపి ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం!

కోట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :

కోట మండలం ఊనుగుంటపాలెం గ్రామానికి చెందిన ఓ డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైనట్లు శనివారం కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈ విద్యార్థిని నెల్లూరులోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన ఆ విద్యార్థిని హాస్టల్‌కు వెళ్లలేదని, ఎక్కడ ఉందో తమకు తెలియలేదని ఆమె బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**యువకుడు అదృశ్యం :** కోట మండలం జరుగుమల్లి గ్రామానికి చెందిన పోలయ్య అనే యువకుడు అదృశ్యమైనట్లు శనివారం కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈ నెల 10వ తేదీన కటింగ్ చేయించుకొస్తానని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## సూళ్లూరుపేటలో మహాసుదర్శన యాగం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీబాలాంజనేయస్వామి ఆలయంలో శనివారం మహా సుదర్శన యాగం నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అయితా శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

## తెలుగుగంగ కాలువను పరిశీలించిన డిఎఫ్ఓ

దొరవారిసత్రం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :



దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలోని తెలుగుగంగ కాలువను డిఎఫ్ఓ శ్యాంసన్ శనివారం పరిశీలించారు. నేలపట్టు పక్షుల కేంద్రంలో ఉన్న వివిధ కాలువలను, అటవీ ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, పక్షులకు నీరు రావడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. వీరితో పాటు రేంజర్ వరప్రసాద్ ఉన్నారు.

## షార్ కాలనీలలో స్వచ్ఛ కార్యక్రమాలు

శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :



శ్రీహరికోటతో పాటు సూళ్లూరుపేటలో ఉన్న పలు షార్ కాలనీలలో శనివారం స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు షార్ అధికారులు, శాస్త్రవేత్తలు, ఉద్యోగులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలుచోట్ల ప్రదర్శనలు జరపడమే కాకుండా పరిశుభ్రత వల్ల ఉపయోగాల గురించి వివరించారు. కాలనీలలోని వివిధ చోట్ల ఉన్న చెత్తాచెదారాలను ఏరి నలుగురికీ ఆదర్శంగా ఉండాలని షార్ శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా పలువురిని ఆకట్టుకున్నారు.

# పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద

వెంకటగిరి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. స్వచ్ఛ వెంకటగిరి కార్యక్రమాన్ని ఆమె కమిషనర్ వెంకట రామయ్యతో కలిసి ప్రారంభించారు. వెంకటగిరి డిస్ట్రిక్ట్ లైబ్రరీ చైర్‌పర్సన్ మీటింగ్‌లో వీధిలో ఎవరూ చెత్తచెదారాలు వేయరాదని సూచించారు. స్వచ్ఛ



వెంకటగిరిగా మార్చవచ్చని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచితే అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. కమిషనర్ వెంకటరామయ్య గాంధీ పార్కును కూడా వైసీపీ సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఢిల్లీ బాబు, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, యస్థానీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు రాజకీయ నేతలు సహకరించాలి : తహసీల్దారు

బాలాయపల్లి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:



మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన అభిప్రాయాలు, అభ్యంత రాలపై అన్ని రాజకీయ పార్టీల నేతలతో, ప్రజలతో తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ మొత్తం 1182 గ్రాడ్యుయేట్, 27 ఉపాధ్యాయ ఓట్లకు గాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో డి.వినీల్‌కుమార్, ఎస్ఐ వీరనారాయణ పరిశీలించారని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని కోరారు.

## 310 కేసులు పరిష్కారం

దొరవారిసత్రం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :

దొరవారిసత్రం మండల పరిధిలోని 10 వివాదాస్పద కేసులు, 300 అపరాధం వసూలు కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు శనివారం ఎస్ఐ జె.తిరుమలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ గ్రామాల్లో గొడవలకు వెళ్లవద్దని సూచించారు. కేసులు పెట్టుకోవడం వల్ల గ్రామాల్లో కక్షలు పెరుగుతున్నాయని, అందరూ సామరస్యంగా ఉండాలన్నారు.

## ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు : తహశీల్దార్

కోట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :



శాసనమండలి ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తహశీల్దార్ పద్మావతి తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి నాయకులు మెలగాలని సూచించారు. ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా లిటిల్‌రోస్ పాఠశాల వార్షికోత్సవం

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:



చిత్తూరు పట్టణం నాగయ్యక్షేత్రంలో శనివారం లిటిల్‌రోస్ పాఠశాల 36వ వార్షికోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల చైర్మెన్ డాక్టర్ బి. గోపాలక్రిష్ణమూర్తి, డైరెక్టర్లు లోహిత్ కుమార్, రాధిక, పవిత్రలు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభపిళ్లై, ఆక్సిస్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సందీప్‌లు మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ అవార్డులను కైవసం చేసుకొన్న లిటిల్‌రోస్ పాఠశాలలో పిల్లలను చదివించడం తల్లిదండ్రుల అదృష్టమని అలాగే భావితరాలకు కావలసిన విలువలతో కూడిన విద్యను ఈ పాఠశాలలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం యుకెజీ పిల్లలకు కాన్వకేషన్ సర్టిఫికేట్స్ ప్రధానంతో పాటు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులనుఅందజేసారు. ఈకార్యక్రమంలోవిద్యార్థులతల్లిదండ్రులు,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు ఎమ్మెల్సీ ఎన్నికలపై రాజకీయ పక్షాలతో సమావేశం

పెద్దపంజాణి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :



చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 13న రాజకీయ పక్షాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులతో ఈనెల 13న మండల కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఎన్నికల కోడ్, ఫ్లైయింగ్ స్కా ్వడ్ విధులు తదితరాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులు, రాజకీయ పక్షాల నేతలు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

# ప్రశాంతంగా ఎంఎల్‌సీ ఎన్నికలు జరిపిద్దాం : తహశీల్దార్

తడ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు సంబంధించి త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ మరియు ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎంఎల్‌సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని తడ తహశీల్దార్ ఎస్.రామయ్య కోరారు. శనివారం ఆయన మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల



నిర్వహణకు సంబంధించి పలు సూచనలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా ఎన్నికలు జరుపుకోవాలని తహశీల్దార్ అన్నారు. ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, ప్రస్తుతం ఎన్నికల కోడ్‌ను తప్పని సరిగా అమలు చేయాలని చెప్పారు. కొళవి రఘు (వైసీపీ), ఆర్.నీలకంఠం (టిడిపి), సుధాకర్‌రెడ్డి (సిపిఐ), ఆర్.కృష్ణమూర్తి (బిజెపి) తదితరులు పాల్గొన్నారు.

# మెసెంజర్స్ దీర్ఘకాలిక సమస్యలపై స్పందించండి సారూ..!



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మరియు జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మెసెంజర్స్ యొక్క దీర్ఘకాలిక సమస్యలైన ఉద్యోగభద్రత, క్రమబద్దీకరణ, పిఎబిలో చేర్చుట, జీతాల పెంపుదల తదితర విషయాలపై శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసిన ఎస్‌సిఆర్‌టి డైరెక్టర్ మరియు కడపజోన్ ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి కల్పలతను వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో కాంటాక్టు పద్దతిలో ఉద్యోగం చేసేందుకు ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక మెసెంజర్ పోస్టులను ఒకే జివో ద్వారా ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగంలోకి తీసుకున్నారని ప్రస్తుతం 16సంవత్సరాలుగా పనిచేస్తున్నామని విద్యాశాఖ కార్యాలయానికి ప్రభుత్వం నుంచి వచ్చే పాఠప్య పుస్తకాలు, జగన్న విద్యాకానుక, కిట్లు, యూనిఫాం,ఇతర సామగ్రి వస్తుంటాయిని ఇలాంటి భద్రత తమదే అని విన్నవించారు. ఎస్ఎంఏలో కాంటాక్టు ఉద్యోగుల వేతనాలు పెరిగిన ప్రతిసారి మెసెంజర్స్ కూడా వేతనాలు పెంచడం జరిగేది, కానీ 2020 ఫిబ్రవరిలో ఎస్ఎస్ఎలోని అన్ని క్యాడర్‌లలో ఉన్న ఉద్యోగులకు వేతనాలు పెంచి కేవలం మెసెంజర్లుకు మాత్రం వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు.తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## తొలిరోజు పల్లకి సేవలో వాల్మీకేశ్వరుడు



నాగలాపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : నాగలాపురం మండలం సురుటుపల్లిలోని మంగలదేవి సమేత పల్లికొండేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమైంది. మొదటిరోజు ఉభయదారులుగా మాజీ ఎమ్మెల్సీ కందేరి కళ్యాణ్ జయచంద్రనాయుడు, విష్ణుకుమారి దంపతులు, కందేరి కళ్యాణ్ చక్రవర్తి, నమత్ర దంపతులు వ్యవహరించారు. శనివారం సాయంత్రం వాల్మీకేశ్వరునికి పల్లకిసేవ వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఏవిఎం బాలాజిరెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి, సభ్యులు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

## సినీ నటులు... విదేశీ భక్తులతో కళ కళ




శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి సినీనటులు మోహన్‌బాబు కుమార్తె సినీ నటి, యాంకర్, సమాజిక కార్యకర్త మంచులక్ష్మీ కుటుంబసమేతంగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. ఆమె మొదట బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా ఆనంద్‌కుమార్ ఇంటి వద్ద ఆతిథ్యం స్వీకరించారు. తరువాత స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వారికి ఆలయం వద్ద కోలా ఆనంద్‌కుమార్ భారీ ఎత్తున కార్యకర్తలచే స్వాగతం ఏర్పాటు చేసారు.కోలా ఆనంద్‌కుమార్ స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలను అందించారు.

**ఆలయంలో రష్యా భక్తులు :**
శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం 40మంది రష్యా భక్తులు మహిళలు, పురుషులు వచ్చారు. వారు ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. పూజలు జరిపించుకున్న వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల దర్శనాలు చేయించి తీర్థ ప్రసాదాలకు అందించారు.

## ధ్వజారోహణంతో
వైభవంగా కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆరంభం -వేడుకగా పల్లకీ ఉత్సవం



తిరుపతి,ఫిబ్రవరి 11ప్రభాతవార్త: టిటిడికి అనుబంధంగా ఉన్న కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం శాస్త్రోక్తంగా వార్షిక బ్రహ్మోత్స వాలకు ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చరణ, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య మీనలగ్నంలో నంది చిత్రంతో ఉన్న వస్త్రాన్ని ధ్వజపటానికి చుట్టి ధ్వజస్తంభంపైకి అధిరోహింప జేశారు. పంచమూర్తులైన సోమస్కంధమూర్తి, కామాక్షిఅమ్మవారు, వినాయకస్వామి, చండికేశ్వరస్వామి, వల్లీదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కపిలేశ్వర ఆలయంలో ధ్వజస్తంభానికి ఏడాదిలో ఒకసారి మాత్రమే విశేష అభిషేకాదులు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణిస్వామి, కంకణభట్టార్ ఉదయస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన ధ్వజారోహణం కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ పార్థసారధి, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు. సాయంత్రం కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు పల్లకీలో ఊరేగారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులిచ్చారు. తొలివాహనంగా రాత్రి 8గంటలకు హంసవాహనంపై కపిలేశ్వరస్వామి ఆలయ పురవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.

## కళ్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా ఊంజల్‌సేవ



నారాయణవనం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్ పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, అర్చకులు పాల్గొన్నారు.

## సత్రవాడ మునిరామయ్యతో తెదేపాకు పూర్వవైభవం



తొట్టంబేడు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త మాజీ ఎంఎల్ఏ సత్రవాడ మునిరామయ్య రాకతో తెలుగుదేశంపార్టీకి పూర్వవైభవం వస్తుందని రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు అన్నారు. ఈసందర్భంగా తొట్టబేడు మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో శనివారం ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి అభినందలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు మాట్లాడుతూ దివంగత నేతలు మాజీ మంత్రివర్యులు బొజ్జలగోపాలకృష్ణారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు హరనాధరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం మాజీ ఛైర్మన్ పోతుగుంటగురవయ్యానాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పేటరాధారెడ్డి, ఏనుగులరాధాపతినాయుడులు లేని లోటును పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో మునిరామయ్య చేరిక ఎంతో అభినందనీయం అన్నారు.అనంతరం మాజీ ఎంఎల్ఏ మునిరామయ్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆశీస్సులు ఉన్నాయని యువళం పాదయాత్రలో సుధీర్‌బాబుతో అందరం కలసి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు అధ్యక్షులు రామకృష్ణనాయుడు,బయ్యారెడ్డి,ఘట్టమనేనిశంకర్‌నాయుడు,ఆర్గనైజింగ్‌కార్యదర్శిమేరీ,వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## దళిత గిరిజన జెపిసీ రాయలసీమ సదస్సును జయప్రదం చేయండి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త తిరుపతిలోని బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్(సిపిఐ కార్యాలయం)లో ఈనెల 17న నిర్వహించనున్న దళిత గిరిజన జెపిసీ రాయలసీమ సదస్సును జయప్రదం చేయాలని దళిత గిరిజన జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం దళిత గిరిజన జెఎసి సదస్సుకు సంబంధించి కరపత్రాలను పిలుపునిచ్చారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగబద్ధపాలన, అణగారిన కులాల హక్కుల పరిరక్షణకు ఉద్యమించడం అత్యంత బాధాకరమన్నారు. తిరుపతి జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలోని దళిత, గిరిజనులు పార్టీలకు అతీతంగా పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలోదళితబహుజన ఫ్రంట్ నాయకులు నత్తంహరిబాబు, బత్తెయ్య, జైభీం ఆర్మీ వ్యవస్థాపకుడు పులిశ్రీకాంత్, సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాలగురవయ్య, ఏపియానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందమామలకోటయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సిలికా తవ్వకాలు అడ్డుకున్న వారిపై కేసులు నమోదు

చిల్లకూరు ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఓ కంపెనీ వారు గత కొంతకాలం నుండి చిల్లకూరు మండలంలో తీరప్రాంత గ్రామాలలో శిలికా సంపదను తరలించేందుకు ప్రభుత్వం నుండి అనుమతులు పొంది ఉన్నారు.అయితే శుక్రవారం ప్రభుత్వ స్దలాలు పొలాలకు వెళ్లే సొనకాలువలు మీద అక్రమంగా సిలికా తరలిస్తున్నారని బల్లవోలు గ్రామ రైతులు యంత్రాలను అడ్డుకోవడం జరిగింది. ఓ కంపెనీ సిబ్బందికి ఆగ్రామ రైతులు మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది.దీంతో ఓ కంపెనీలో పనిచేస్తున్న సిబ్బంది చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ ఘర్షణకు సంబంధించి ప్రముఖ పారిశ్రామికవేత్త వైఎస్‌ఆర్‌సిపి సీనియర్‌నాయకులు మారంరెడ్డి అమర్‌నాద్‌రెడ్డి దీనికి పూర్తి సహకారాలు అందించారని ఆ సంస్ద సిబ్బంది ఫిర్యాదులో నమోదు చేయడం జరిగింది. దీంతో అమర్‌నాధ్‌రెడ్డితో పాటు 7 మందిని చిల్లకూరు పోలీసులు అరెస్టు చేసి గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బల్లవోలు గ్రామస్తులు, మారంరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి నాయకులతో కలిసి మాట్లాడుతు మండలంలో అక్రమ సిలాకా సంపద దోచుకోవడం చాలా దారుణమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో షుమారుగా 80 సిలికా మైన్లు ద్వారా ఎంతో మంది జీవనోపాధి పొందేవారని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత పక్క రాష్ట్రాల వారికి అనుమతులు ఇవ్వడంతో వారు చెప్పిన రేటుకే సిలికా సంపదను ఇవ్వాలని అనడంతో సిలికా మైన్ యజమానులు చేసేది ఏమిలేక బోరున విలపిస్తున్నారని వెంకటేశ వ్ర్లు రెడ్డి డిమాండ్ చేశారు. రాత్రి అమర్‌నాధ్‌రెడ్డితో పాటు 7 మందిని కోర్టుకు హాజరుపరచగా బెయిల్ మంజూరు చేయడం జరిగింది.దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఎలక్ట్రిక్ ఆల్ టెర్రయిన్ వెహికల్ డిజైన్

కోట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఎలక్ట్రిక్ ఆల్ టెర్రయిన్ వెహికల్ (ఎటివి) డిజైన్ మరియు ఫ్యాబ్రికేషన్‌పై ఐదు వారాల ఇన్ హౌస్‌ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ఆన్‌లైన్ మోడ్ ద్వారా నిర్వహించారు. హైదరాబాద్ ఆధారిత స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, ఫాటర్నిటీ ఆఫ్ మెకానికల్ అండ్ ఆటోమొబైల్ ఇంజనీర్లు అమన్, రవిరాబిన్, ఆదిత్యారావు, అనిల్‌సింగ్ మెహతా ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు ఆదిత్యారావు మాట్లాడుతూ రానున్న దశాబ్ద కాలంలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆటోమొబైల్ మరియు ఎలక్ట్రిక్ వాహన తయారీ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మరో అతిథి రవి రాబిన్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎలక్ట్రిక్ వెహికల్ తయారీలో మెళకువలు నేర్పించి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ఖరీదు సుమారు రూ.8.5 లక్షలు అని, ఈ మొత్తాన్ని కాలేజి స్పాన్సర్ చేస్తుందని తెలిపారు. హిమాచలప్రదేశ్‌లోని బడ్డిలోని చిత్తకారా విశ్వ విద్యాలయంలో ఏప్రిల్ మాసంలో జరగనున్న ఎస్ఎఇఇ-బజా 2023 ఈవెంట్‌లో పాల్గొనే ఎన్‌బికెఆర్ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఈ ఇంటర్న్‌షిప్‌కు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మెకానికల్ విభాగాధిపతి విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ ఈ పోటీల్లో మెకానికల్ విద్యార్థులు పాల్గొని జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఇ ఫ్యాకల్టీ అడ్వయిజర్ అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాలసముద్రం దేశం నాయకుల చిందులు



పాలసముద్రం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ఎస్ఆర్ పురం మండలంలో శనివారం జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో పాలసముద్రం మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు డాన్స్ చేస్తూ చిందులు వేశారు. జిడినెల్లూరు నియోజకవర్గ దేశం సమన్వయకర్త భీమినేని చిట్టిబాబు ఆధ్వర్యంలో నారా లోకేష్ పాదయాత్రకు శనివారం పాలసముద్రం నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఎస్ఆర్ పురం మండలంలో నారా లోకేష్ పాదయాత్ర కొనసాగుతుండటంతో అక్కడికి చేరుకొన్న వీరు నారా లోకేష్‌నడకకు ముందు చేరుకొని స్టెప్పులు వేస్తూ ముందుకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం మండల దేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్, యువత కార్యదర్శి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధన మహోత్సవం

చంద్రగిరి ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: స్థానిక ధర్మరాజుల గుడి వద్ద ఈ నెల 20న సాయంత్రం 6 గంటలకు శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహకుడు పండ్లూరు మునిరత్నం తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన కార్యక్రమ వివరాలను వివరించారు. ఈ ఆరాధన మహోత్సవంలో నాదస్వర కచ్చేరి అద్భుత మాధుర్యాన్ని పంచగలదన్నారు. ఇందులో నాదస్వర విధ్వాన్‌లుగా పిలువబడుతున్న ఎ.శరత్‌బాబు, కె.వేణుగోపాల్, యం.రాము, డోలు వాయిద్య యువకళా తారకరత్న తాళ వాయిద్య ప్రవీణ యం.నరేంద్ర, డోలు వాయిద్య ప్రవీణ టి.సునీల్‌కుమార్, డోలు విద్వాన్ టి.మోహిత్ హాజరై ఆరాధనా మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం రాత్రి 10 గంటలకు ఎంఎల్‌ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా నాదస్వర కచ్చేరి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందులో నాదస్వర విధ్వాంసులు వి.కోటకు చెందిన యం.మురళీ, జి.బాలాజీ, లయ జ్ఞాన జ్యోతి, వి.యం.గణేష్, డోలు వాయిద్య విద్వాన్ కె.యం.మనోహర్ ఆధ్వర్యంలో కచ్చేరి వుంటుందన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అన్నారు.

## కళ్ళిపూడిలోబాల్యవివాహం



తొట్టంబేడు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త బాల్యవివాహాలను నియంత్రించాలని ప్రభుత్వం, అధికారులు నెత్తినోరు కొట్టుకుంటున్నా గ్రామాల్లో మాత్రం బాల్యవివాహాలు రాత్రికి రాత్రే జరిగిపోతున్నాయి.ఈనేపథ్యంలో మండలంలోని కల్లిపూడి గ్రామానికి చెందిన ఎ.వెంకటమ్మ కుమార్తె ఎనిమిదో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన ఓయువకుడితో గురువారం రాత్రి వివాహం జరిగింది. దీంతో సమాచారం అందుకున్న తొట్టంబేడు సిడిపిఒ ఫర్హానా ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ రత్నమ్మ, మహిళా పోలీసులు మరియు అంగన్‌వాడీసిబ్బందివారిఇంటికివెళ్ళివిచారించారు.అయితేవధూవరులు లేకపోవడంతో వారి తల్లిదండ్రులకు కౌన్సి లింగ్ ఇచ్చారు. ఇలాంటివి పునరావృత్తం అయితే వారిపై కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు.

## దీనదయాల్‌కు ఘనంగా నివాళులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త దేశ అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన భరతమాత ముద్దుబిడ్డ, భారతీయ ముద్దుబిడ్డ, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, బిజెపి సిద్ధాంతకర్త పండిట్.దీనదయాల్ ఉపాధ్యాయకు సమర్పన్ దివస్ సందర్భంగా పట్టణ బిజెపి అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు ఆధ్వర్యంలో పాత బస్టాండు వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర మీడియా ప్రధానకార్యదర్శి కోలా.ఆనంద్ సారధ్యంలో స్థానిక పాతబస్టాండు వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనదయాల్ బాటలో నిజాయితీగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయనలా పార్టీకి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యదర్శి కండ్రిగ ఉమ, రాష్ట్ర నాయకులు, జిల్లా స్థాయి నాయకులు, మండల పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ థాయ్ బాక్సింగ్ పోటీల్లో రెయిన్‌బో హవా



రేణిగుంట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: స్కూల్ గేమ్స్ థాయ్ బాక్సింగ్ పోటీలు ఆర్గనైజర్ సెక్రటరీ కుమార షణ్ముగం, అధ్యక్షుడు పట్టాభి ఆధ్వర్యంలో తిరుపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం జరిగాయి. పోటీల్లో రేణిగుంట రెయిన్‌బో గ్రూప్‌స్కూల్స్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి అనేక బహుమతులు కైవసం చేసుకున్నారు. అండర్ 19 విభాగంలో 40 కేజీల కేటగిరిలో చరణ్ 90 కేజీల కేటగిరిలో కృష్ణ ప్రథమ బహుమతులు అందుకున్నారు. రెండో బహుమ తులను 65 కేజీల కేటగిరిలో అమీన్‌హుసేన్, 45 కేజీల కేటగిరిలో రూహిసన దక్కించుకున్నారు. స్టేట్ లెవెల్ పోటీలకు చరణ్, కృష్ణలు అర్హత పొందారు. వీరిని రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ అతావుల్లా ఖాన్, బాక్సింగ్ కోచ్ కుమార షణ్ముగం, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## రాష్ట్రంలో అతిధులకు శివరాత్రి ఆహ్వాన పత్రికలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే మహాశివ రాత్రి బ్రహ్మోత్స వాలకు రాష్ట్రంలోని మంత్రులు అతిధులకు ఆహ్వాన పత్రికలను ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహచరులు అందిస్తున్నారు. మూడు రోజులుగా రాజధానిలోని పలువురు మంత్రులకు ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, దుర్గామల్లేశ్వరాలయ ఇఓ డి.బ్రమరాంబలకు ఆహ్వానాలను అందించారు. వారితో పాటు ఇఓ విజసాగర్‌బాబు, సభ్యులు బుల్లెట్ శ్యాం, పౌరోహితులు అర్ధగిరి స్వామి, పరిచారకులు రాకేష్‌శర్మ,పార్టీకిచెందిననరసింహారాజు(నంద),మాజీకౌన్సి లర్‌కంఠాఉదయ్,గరికపాటి చంద్ర పాల్గొన్నారు

## ఎవరు గొప్ప వృత్తాంతంతో సాంస్కృతిక వేదిక రూపకల్పన



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలకు దక్షిణ కైలాసం ముస్తాబౌతుంది. ఈ సారి ధూర్జటి కళాప్రాంగణంలోని వేదికను చూపురులను ఇట్టే ఆకట్టుకునేటట్లు రూపొందిస్తున్నారు. యుద్ద ప్రాతిపదికపై కళాకారులు రూపకల్పన చేస్తున్నారు. శివుని విశ్వరూపంతో శివయ్య ఆది అంతం కనుగొనాలని వినాయకుడు, సుబ్రమణ్యం స్వామి ప్రదక్షిణలు చేసే ఇతి వృత్తంతో దక్షిణ కైలాసం బ్యాక్ గ్రౌండను రూపొందిస్తున్నారు. ఈ వేదికను ఆధ్మాత్మిక శోభాయమానంగా రూపొందిస్తున్నారు. స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయులు స్వర్ణమూర్తి చొరవ తీసుకొని వేదికను, సాంస్కృతిక కార్యక్రమాలను తీర్చి దిద్దుతున్నారు.

## వసంతమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



నింద్ర,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని వైకాపా సినియర్ నాయకురాలు వసంతమ్మ కుటుంబాన్ని శనివారం స్వగ్రామంలో రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా పరామర్శించినారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతి చెందిన వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.మండల కేంద్రంలోని ధర్మారెడ్డి కుమారుడు మణిగండన్ కుటుంబాన్ని మంత్రివర్యులు పరామర్శించినారు.ఈకార్యక్రమంలో యంపిపి దీపాజలంధర్‌రాజు,నింద్ర సర్పంచ్ వసంత్ బాబురెడ్డి,వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కోఆప్షన్ మెంబరు అనిల్,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి,యంపిటిసిలు శుభారాము,విజేష్ నాయకులు మేరీజయ రామ్, మహేష్,దాము, సత్యరాజ్,సుధాకర్,సుబ్రమణ్యం యాదవ్, తండవ రాయన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు భూకంప మృతులకు సంతాప ర్యాలీ



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: టర్కీ,సిరియాలలో భూకంపం కారణంగా మృత్యువాత పడ్డ బాధితుల కుటుంబాలను ఆదుకునే కోణంలో మృతులకు సంతాపంగా నేడు ఆదివారం ఉదయం 7-30 గంటలకు మౌన ర్యాలీ తలపెట్టినట్లు టర్కీ,సిరియా భూకంప సహాయక సమన్వయ సమితి సభ్యుడు మరియు గ్లోబల్ రీచ్ ఫౌండేషన్ అధ్యక్షుడు డా॥రమేష్‌నాథ్ లింగుట్ల,లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌లు తెలిపారు.శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ ఈ ర్యాలీలో ఎవరైనా వచ్చి పాల్గొనవచ్చని వారు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ స్మార్ట్ సిటీ అధ్యక్షుడు సోమయ్య, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చలపతిరావు, జేసిఐ అధ్యక్షుడు గుణశేఖర్,రోటరీ క్లబ్ కార్యదర్శి రాజు, హేమచందర్, అంకయ్య, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు గంటల్లో చోరీ కారును పట్టుకున్న పోలీసులు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చి కారును పోగొట్టుకున్న బాధితులకు కేవలం రెండు గంటల్లో పట్టుకొని తమ ప్రతిభా పాటవాలను నిరూపించు కున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి భద్రాచలం తాత గుడి సెంటర్‌కు చెందిన డి.ప్రసాద్ కుటుంబసభ్యులతో వచ్చారు. తమ కారు నెంబర్ ఎపి 03 సికె 3154ను జలవినాయక ఆలయం సమీపంలోని స్వర్ణముఖి నదిలో పార్కింగ్ చేసారు. దర్శనానికి వెళ్ళి వచ్చిన వారు పార్కింగ్ చేసిన చోట కార్ లేకపోవటంతో వారికి ముచ్చెమటలు పట్టింది. వెంటనే వారు ట్రాఫిక్ సిఐ వెంకటప్పనాయుడుకు ఫిర్యాదు చేసారు. ఆయన వెంటనే తన సిబ్బంది ట్రాఫిక్ ఎఎస్ఐ రియాజ్, కానిస్టేబుల్ వెంకటరెడ్డిలకు సూచించారు. వెంటనే నాయుడుపేట,సూళూరుపేట చెక్ పోస్టులకు అలాగే కార్‌నెంబర్‌ను పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. ఇక్కడి సిసి కెమెరాలను పరిశీలించారు. కానీ కారు బయటకు పోలేదు.మరి ఏమైందని స్వర్ణముఖి నది అంతా వెదికారు.కారును దొంగలించిన దొంగ జలవినాయక ఆలయం వద్ద ట్రాఫిక్ పోలీసు ఉండటంతో దొంగ సాహసించ లేకపోయాడు. అయితే కారును తీసుకెళ్ళి దూరంగా నదిలోని ముళ్ళ పొదల మధ్య పెట్టి పలాయనం చిత్తగించినట్లు పోలీసులు గుర్తించారు.కారును బాధితులకు అప్పగించారు. దాంతో బాధితుల కళ్లు చెమ్మగిల్లాయి. పోలీసులకు ధన్యవాదాలు తెలిపి వెళ్ళారు.పోలీసుల చర్యలను అభినందించారు.

## లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పుకు అప్పీలు లేదు
-సీనియర్ సివిల్‌జడ్జి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పుకు అప్పీలు లేదని ఇక్కడ ఇచ్చిన తీర్పే అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో సమానం అని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబిరాణి మరియు అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి నరేంద్రరెడ్డిలు అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్‌జడ్జిబేబిరాణిమాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవడానికి సహకరిస్తూ లోక్‌అదాలత్ విజయవంతానికి కృషి చేయాలని, రాజీమార్గమే రాజమార్గంగా ఎన్నుకుని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు అన్నిశాఖ అధికారులు దోహదపడాలని సూచించారు. అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి నరేంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసుల్లో కక్షిదారులను ఒప్పించి అధిక సంఖ్యలోపూర్తి చేయాలని తెలిపారు. ఎన్ఐ యాక్టు కేసుల్లో సుమారు 2లక్షల విలువచేసే చెక్కు ఎన్ఐ యాక్టు కేసు యుఎస్/138, బ్యాంకు రికవరీకేసు, మ్యాట్రిమోనీ కేసు, కార్మికుల సమస్యలను, భూవివాదాతలు, సివిల్‌కేసులు, రెవెన్యూ, కాంపౌండ్ ఎక్సైజ్ కేసు, ఫ్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు లోక్‌అదాలత్‌లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో ఉచిత వైద్యశిబిరం, ఐసిడిఎస్ శాఖ ద్వారా అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు అందించి పౌష్టికాహారం మరియు వారి మేధస్సును పెంపొందించే విధంగా ఉపయోగపడే బొమ్మలను ప్రదర్శించారు. మరియు మహిళ పోలీస్ దిశాచట్టం, సైబర్ క్రైం గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు 22, క్రిమినల్ కేసులు 450, మరియు బ్యాంకు కేసులు 41 పరిష్కరించడంతో పాటు రూ.1,09,33,585లునగదు రికవరీఅయినట్లుతెలిపారు.పలువురున్యాయవాదులు,అన్నిశాఖల అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి భారీ బందోబస్తు
-భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వం..డిఎస్పి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : పవిత్ర పుణ్యక్షేత్రం, దక్షిణకాశీగా పిలవబడే శ్రీకాళహస్తిలో రేపటి నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలకు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు డిఎస్పి విశ్వనాధం, అర్బన్ సిఐ అంజూయాదవ్‌లు తెలిపారు.ఈ ఏడాది మూడు రోజుల మాత్రమే బయటి పోలీసులతో బందోబస్తుఏర్పాటు చేసామన్నారు. అంతేకాక గేట్లు లేని క్యూలైన్ల ద్వారా భక్తులకు సుదర్శనం కల్పించుటకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా పోలీసులు పాలకులకు తాము రూపొందించిన ప్రణాళికను వివరించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలు 13రోజుల పాటు నిర్వహిస్తున్నారని ఇందుకు సంబంధించి బందోబస్తుపై ప్రత్యేకదృష్టిసారించినట్లు తెలిపారు. సిఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్ళు, మహిళా పోలీసులు ప్రత్యేకబృందాలు, హోం గార్డులు, ప్రత్యేక బలగాలు నియమించినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు సుమారు 700 మంది సిబ్బంది విధులకు ప్రణాళిక రూపొందించామన్నారు. మొత్తం 100కు పైగా సిసి కెమెరాలను ఏర్పాటుచేసి వీటిని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తున్నామని, వృద్దులు, చిన్నారులకు జియోట్యాగింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.